జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
## భద్రాద్రి కొత్తగూడెం
శుక్రవారం | 30 | మే | 2025 • పేజీలు : 4

## భద్రాద్రి రామయ్యను దర్శించుకున్న మంత్రి సీతక్క



2 లో...




# నాణ్యత ప్రమాణాలు పెంచాలి

- వినియోగదారులను నిలుపుకోవాలి
- నూతన గనులను సాధించుకోవడానికి కృషి చేయాలి
- పని సంస్కృతిలో మార్పునకు కార్మిక సంఘాల సహకారం తీసుకోవాలి

**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, మే 29, ప్రజాజ్యోతి :** రానున్న రోజుల్లో ఇంధన రంగంలో స్వయం సమృద్ధిని సాధించే విషయంలో ప్రభుత్వ బొగ్గు సంస్థలు డిమాండ్ కు తగినట్టుగా నాణ్యమైన బొగ్గును ఉత్పత్తి చేసేలా సమాయత్త పరిచేందుకు కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ నడుం కట్టిందని కేంద్ర బొగ్గు శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి అన్నారు. గురువారం కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి అధ్యక్షతన ఢిల్లీ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. బొగ్గు ఉత్పత్తి వ్యయం తగ్గింపు, నాణ్యత, సరఫరా తదితర అంశాల్లో ఎదురవుతున్న సవాళ్లు, వాటిపై తీసుకోవాల్సిన చర్యలపై కీలక దిశా నిర్దేశం చేశారు. సింగరేణి సంస్థ సి అండ్ ఎండి ఎన్.బలరామ్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సింగరేణి సంస్థ ప్రగతి, భవిష్యత్తు ప్రణాళికలు తదితర అంశాలపై కూలంకశంగా వివరించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మాట్లాడుతూ

మిగతా 2 లో...



# కంపెనీ సమాచారం కోసం బెదిరించే వారిని లెక్క చేయవద్దు

గోప్యత గల కంపెనీ డాక్యుమెంట్లను బయటి వారికి ఇస్తే కఠిన చర్యలు

బెదిరింపులకు, ఒత్తిడికి గురి చేసే వారి సమాచారం యాజమాన్యానికి తెలియజేయండి

సింగరేణి ఉద్యోగుల అధికారులకు సింగరేణి డైరెక్టర్ (పీపీ అండ్ పర్సనల్ ) సూచన

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, మే 29, ప్రజాజ్యోతి :** సింగరేణి సంస్థకు సంబంధించిన గోప్యనీయ సమాచారాన్ని తమకు ఇవ్వాల్సిందిగా కొందరు వ్యక్తులు కంపెనీ ఉద్యోగులని, అధికారులని బెదిరిస్తున్నట్లు, ఒత్తిడికి గురి చేస్తున్నట్లు తెలుస్తోందని, ఇటువంటివారు ఏ స్థాయిలో ఉన్న వారైనా లెక్క చేయాల్సిన అవసరం లేదని, కంపెనీకి సంబంధించిన

మిగతా 2 లో...

## సింగరేణి వైద్యులూ..
# మీ సామర్థ్యం నిరూపించుకోండి

- చిన్న చిన్న వ్యాధులకు మన వద్దే వైద్యం చేయండి
- సింగరేణి వైద్య విభాగానికి ఏటా 400 కోట్ల వ్యయం
- అయినా సరే అన్ని కేసులను రిఫరల్ కి పంపితే ఇక మన నైపుణ్యత ఏమిటి?
- సమయ పాలన పాటిస్తూ అంకిత భావంతో విధులు నిర్వర్తించండి
- కోవిడ్ విషయంలోనూ అప్రమత్తంగా ఉండాలి
- అన్ని ఏరియాల వైద్యాధికారుల సమీక్షలో సీఎండీ ఎన్.బలరామ్

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి , మే 29, ప్రజాజ్యోతి :** సింగరేణి కార్మికులకు, వారి కుటుంబ సభ్యులకు వైద్య సేవలు అందించడం కోసం ఖర్చుకు వెనకాడకుండా అన్ని రకాల వైద్య పరీక్షల యంత్రాలు, ఔషధాలు సమకూర్చటానికి యాజమాన్యం సంసిద్ధంగా ఉందని ఇప్పటికే పలుమార్లు చెప్పానని, అయినప్పటికీ కొన్ని ఏరియా ఆసుపత్రుల నుండి ప్రతిపాదనలు పంపడంలో ఎందుకు శ్రద్ధ వహించడం లేదు అని సింగరేణి వైద్య శాఖ పై చైర్మన్ , ఎండీ ఎన్.బలరామ్

మిగతా 2 లో...



## ప్రభుత్వ బడిని కాపాడుకుందాం

- పిల్లలను ప్రభుత్వ బడులలో చేర్పిద్దాం
- టిఎస్ యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.రాజు పిలుపు
- నమోదు కొరకు ప్రచార జాతా ప్రారంభం



**భద్రాచలం టౌన్, మే 29, ప్రజాజ్యోతి :** తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి నాణ్యమైన విద్యను పొందాలని, ప్రభుత్వ బడులను కాపాడుకోవాలని టిఎస్ యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.రాజు పిలుపునిచ్చారు. గురువారం ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లల నమోదు పెంపుదల కొరకు టీఎస్ యుటిఎఫ్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించ బడుతున్న ప్రచార జాతాను స్థానిక అంబెడ్కర్ సెంటర్ భద్రాచలం నందు జెండా ఊపి సీనియర్ నాయకులు పి. లక్ష్మి నారాయణ ప్రారంభించారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి బి.రాజు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో సుశిక్షితులైన ఉపాధ్యాయులు ఉన్నారని, విశాలమైన తరగతి గదులు , ఆటస్థలం ఉన్నాయని తల్లిదండ్రులందరూ తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి నాణ్యమైన విద్యను ఉచితంగా పొందాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ బడులను కాపాడాల్సిన బాధ్యత తల్లిదండ్రుల పైన ఉన్నదని తెలియజేశారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు,నోటు పుస్తకాలు, వర్క్ బుక్కులు, ఏకరూప దుస్తులు ఉచితంగా అందించబడు తున్నాయని, నాణ్యమైన మధ్యాహ్న భోజనం, వారానికి మూడు సార్లు కోడిగుడ్లు, రాగిజావ అందిస్తున్నారని తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలలను ఆదరించి పిల్లలను చేర్పించి, ఫీజుల భారం లేని ఉచిత విద్య పొందాలని, విద్యార్థుల సమగ్ర వికాసానికి ప్రభుత్వ పాఠశాలలు దోహదపడుతాయని తెలియజేశారు. గుడి, మసీదు,చర్చిల నిర్మాణం కోసం ఐకమత్యంగా కదిలే ప్రజలు ఊరి బడి కోసం కూడా ఏకమై బడిని నిలబెట్టుకోవాల్సిన బాధ్యత ఉందని తెలియజేశారు. గ్రామాలలో ప్రతి ఇంటికి వెళ్ళి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించాలని టీఎస్ యుటిఎఫ్ శ్రేణులు గురువారం నుండి జూన్ 5 వరకు ప్రచారం నిర్వహిస్తాయని తెలియజేశారు. ఆంగ్ల మాధ్యమంలో విద్యా బోధన, ఉచిత ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తారని, అత్యున్నత విద్యార్హతలు కలిగిన టీచర్లు ఉంటారని తల్లిదండ్రులకు వివరిస్తామని తెలియజేశారు. తల్లిదండ్రుల ఆశను ప్రైవేటు విద్యా వ్యాపారులు సొమ్ము చేసుకుంటున్నారని, చదువుల నాణ్యతలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల మధ్య పెద్దగా వ్యత్యాసం లేదని పలు సర్వేలు వెల్లడిస్తున్నాయని, సంపాదనలో సగానికి పైగా పిల్లల చదువుల కోసమే ఖర్చు చేయాల్సిన దుస్థితి ఏర్పడిందని, ప్రభుత్వ బడి మూతపడితే సమాజానికి నష్టం అని, మన ఊరు – మనబడి, అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల ద్వారా మౌళిక వసతుల కల్పన మెరుగైందని తెలియజేశారు. ప్రాథమిక పాఠశాలల్లో పూర్వ ప్రాథమిక తరగతులను ప్రారంభించటానికి ప్రభుత్వం సన్నాహాలు చేస్తోందని, ఏఐ ఆధారిత బోధన, డిజిటల్ తరగతి గదులు, లైబ్రరీ, లేబరేటరీలతో పాటు ఆట పాటలతో అహ్లాదకరమైన వాతావరణంలో, ప్రతి విద్యార్థి పట్ల వ్యక్తిగత శ్రద్ధతో, నిపుణులైన ఉపాధ్యాయులతో ఒత్తిడి లేని చదువు అందించబడుతుందని, పిల్లల మానసిక ఆరోగ్యానికి, వ్యక్తిత్వ వికాసానికి అనువుగా ప్రభుత్వ పాఠశాలలు రూపుదిద్దుకుంటున్నాయని, మన పిల్లలను మన ఊరి బడిలోనే చేర్పించి బడికి అవసరమైన వసతుల కల్పనకు ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తే తప్పనిసరిగా బడి నిలబడుతుందని తెలియజేశారు. పిల్లలకు నాణ్యమైన విద్య ఉచితంగా అందుతుంది. తల్లిదండ్రులకు ఫీజుల భారం తగ్గుతుంది. కనుక తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి వారి భవిష్యత్తుకు భరోసా ఇవ్వాలని బి. రాజు పిలుపునిచ్చారు. పట్టణం లోని అంబెడ్కర్ సెంటర్,బస్టాండ్, యు బి రోడ్,తాత గుడి సెంటర్, ప్రభుత్వ జూనియర్ కాలేజ్ , పాత మార్కెట్ , ఐ టీ డి ఏ రోడ్ జగదీష్ కాలనీ, ఎంపీ కాలనీ, కెసిఆర్ కాలనీ ఏరియాలలో తొలిరోజు ప్రచారం నిర్వహించారు. ఈ ప్రచార జాతలో సంఘం జిల్లా అధ్యక్షులు బి.మురళీమోహన్, ఎఫ్ డబ్ల్యు ఎఫ్ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ ఎన్.కృష్ణ, రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యులు ఎస్.వెంకటేశ్వర్లు, జిల్లా కార్యదర్శులు డి.తావుర్య, ఎస్.శైలజ, ఎస్. విజయ కుమార్, ఎం.సత్య నారాయణ, టీవీఎస్ ప్రసాద్, చిన్నక్క భద్రాచలం, బూర్గంపాడు, దుమ్ముగూడెం, ఇల్లందు మండల భాద్యులు ఏ.వెంకటేశ్వర్లు , బి .రమేష్ , ఆంగోత్ రాంబాబు, రమేష్ చంద్, వి రాంబాబు, రాజా శ్రీనివాస్, మహిళా నాయకులు ఇర్పా అనసూయ, నాగమణి , కార్యకర్తలు శ్యాంసుందర్ , శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణి వైద్యులూ..
# మీ సామర్థ్యం నిరూపించుకోండి

(మొదటి పేజీ తరువాయి...)

ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం ఆయన సింగరేణి వ్యాప్తంగా ఉన్న అన్ని ఏరియా ఆసుపత్రుల ప్రధాన వైద్యాధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏరియా ఆసుపత్రుల యాజమాన్యాలు తక్షణమే వారికి కావలసి ఉన్న కనీస వైద్య పరికరాలు, అవసరమైన మందుల ప్రతిపాదనలు పంపించాలని, తన తదుపరి తనిఖీలలో ఏ ఒక్క పరికరం లేదు అనే మాట రాకూడదని హెచ్చరించారు. వార్షిక ప్రణాళిక పేర్లతో సంబంధం లేకుండా ఎప్పటికప్పుడు ఏ ఏ పరికరాలు కావాలన్నది నిర్ధారించుకొని ప్రతిపాదనలు పంపించాలన్నారు. ఇప్పటికే ఏరియా ఆసుపత్రులకు వైద్యుల్ని కేటాయించామని, ఇంకా అవసరమైన వైద్యుల్ని, టెక్నీషియన్ లను సమకూర్చేందుకు యాజమాన్యం సంసిద్ధంగా ఉందన్నారు. చిన్న చిన్న ఆరోగ్య సమస్యలు ఉన్న రోగులకు ఏరియా ఆసుపత్రుల్లో వైద్యం అందించే అవకాశం ఉన్నప్పటికీ అలా చేయకుండా వెంటనే హైదరాబాద్ ఆసుపత్రులకు రిఫర్ చేస్తున్నారని, తద్వారా గత మూడేళ్లలో 30 కోట్ల రూపాయలు ఉన్న రిఫరల్ బిల్లులు ఇప్పుడు రూ100 కోట్లకు చేరాయి అన్నారు. కంపెనీ డాక్టర్లు తమ సమర్థతను, నైపుణ్యాన్ని చూపించకుండా ప్రతి చిన్న కేసును రిఫర్ చేయడం ఆశ్చర్యం కలిగిస్తుంది అన్నారు. డాక్టర్లు అంకితభావంతో వైద్య సేవలు అందించాలని, విధి నిర్వహణలో పూర్తి క్రమశిక్షణ పాటించాలని ఆయన కోరారు. సింగరేణి ఉద్యోగుల ఆరోగ్య పరిరక్షణ కోసం యాజమాన్యం ఏటా 400 కోట్ల రూపాయలను వెచ్చిస్తోంది. ఆసుపత్రులను ఆధునికీకరిస్తోందని తెలిపారు. హైదరాబాద్ లోనూ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ఏర్పాటు దిశగా ప్రయత్నాలు సాగుతున్నాయన్నారు. ఈ నేపథ్యంలో సింగరేణి లో పనిచేస్తున్న వైద్యులంతా పూర్తి అంకిత భావంతో పనిచేయాలని, కార్మికుల నమ్మకాన్ని గెలచుకోవాలని సూచించారు. గతంలో వైద్య సేవలకు నిధుల మంజూరులో అనేక ఆటంకాలు ఉండేవని, కానీ ఇప్పుడు ఎటువంటి కోతలు, తగ్గింపులు లేకుండా నిధులు మంజూరు చేయటానికి యాజమాన్యం సిద్ధంగా ఉందని, ఈ సానుకూల దృక్పథాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిన బాధ్యత ఆసుపత్రుల యాజమాన్యాలపై ఉందని ఛైర్మన్ పేర్కొన్నారు. కాగా కోవిడ్ వ్యాప్తి జరిగినట్లయితే దానిని ఎదుర్కొనేందుకు అన్ని ఏరియా ఆసుపత్రుల్లో తగిన విధంగా సంసిద్ధమై ఉండాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్లు డి.సత్య నారాయణ రావు(ఈ అండ్ ఎం), ఎల్వీ సూర్యనారాయణ రావు (ఆపరేషన్స్), కె.వేంకటేశ్వర్లు (పి అండ్ పి, పా), ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కోల్ మూమెంట్ ఎస్.డి.ఎం.సుభానీ, జీఎం(మార్కెటింగ్) ఎన్.వి.రాజశేఖరరావు, చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కిరణ్ రాజ్ కుమార్, అన్ని ఏరియా ఆసుపత్రుల ముఖ్య అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# నాణ్యత ప్రమాణాలు పెంచాలి




(మొదటి పేజీ తరువాయి...)

కార్మికుల జీతాలు, సంక్షేమ కార్యక్రమాలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా బొగ్గు ఉత్పత్తి ఖర్చు గణనీయంగా తగ్గించాలన్నారు. ఇందుకోసం కార్మిక సంఘాల సహకారాన్ని తీసుకోవాలని, పని సంస్కృతి మెరుగుపరచాలని సూచించారు. అలాగే ఉత్పత్తి ఖర్చు తగ్గింపునకు సింగరేణి అధికారులు, బొగ్గు మంత్రిత్వ శాఖ నిపుణులతో ఒక కమిటీని ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ కమిటీ ప్రత్యక్షంగా క్షేత్రస్థాయి పరిశీలన జరుపుతుందని, కమిటీ చేసే ఆచరణాత్మక సూచనలను వెంటనే అమలు జరిపి ఉత్పత్తి ఖర్చును తగ్గించాలన్నారు. వినియోగదారులు సింగరేణి సంస్థకు దూరం కాకుండా ఉండాలంటే నాణ్యతపై కూడా గట్టి దృష్టి పెట్టాలన్నారు. అనంతరం బొగ్గు శాఖ కార్యదర్శి విక్రమ్ దేవ్ దత్ మాట్లాడుతూ బొగ్గు సంస్థల మనుగడకు కొత్త గనులను పెంచుకోవడం అత్యంత అవసరమని, అలాగే ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించడం ద్వారా వినియోగదారులకు బొగ్గు ధర అందుబాటులోకి తీసుకురావచ్చని, దీంతో అంతిమంగా విద్యుత్ ఉత్పత్తి వ్యయం కూడా తగ్గి ప్రజలకు లబ్ధి చేకూరుతుందన్నారు. అనంతరం కోల్ ఇండియా గనులతో పాటు సింగరేణి గనుల పనితీరు, సంక్షేమ కార్యక్రమాలను సమీక్షించారు. ఈ సమావేశంలో సంస్థ డైరెక్టర్లు డి. సత్యనారాయణ రావు(ఈ అండ్ ఎం), ఎల్వీ. సూర్యనారాయణ రావు (ఆపరేషన్స్), కె. వెంకటేశ్వర్లు (పి అండ్ పి, పా), ఈడీ ఎస్డీఎం. సుభాని తదితరులు పాల్గొన్నారు.

## భద్రాద్రి రామయ్యను దర్శించుకున్న మంత్రి సీతక్క

**భద్రాచలం టౌన్, మే 29, ప్రజాజ్యోతి :** భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామివారిని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖామంత్రి దనసరి సీతక్క కుటుంబ సమేతంగా గురువారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఆమెను ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి గర్భగుడిలో పూజలు చేశారు. ఈ సందర్భంగా సీతక్క స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం వేదపండితులు వేదాశీర్వచనం అందజేశారు. ఆలయంలోని ఉప ఆలయాలైన శ్రీలక్ష్మీతాయారు, అభయాంజనేయస్వామివార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు ఆలయ విశిష్టతను ఆమెకు వివరించారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం, పినపాక, అశ్వారావుపేట ఎమ్మెల్యేలు తెల్లం వెంకట్రావు, పాయం వెంకటేశ్వర్లు, జారె ఆదినారాయణలతో పాటు కాంగ్రెస్ నాయకులు భజన ప్రసాద్, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

## కంపెనీ సమాచారం కోసం బెదిరించే వారిని లెక్క చేయవద్దు

(మొదటి పేజీ తరువాయి...)

సమాచారాన్ని, కానీ డాక్యుమెంట్లను కానీ ఇతరులెవ్వరికీ ఇవ్వకూడదని సంస్థ డైరెక్టర్ పి పి,పర్సనల్ గురువారం ఒక సర్క్యులర్ లో పేర్కొన్నారు. కీలకమైన శాఖల్లో ఉద్యోగ బాధ్యతలను నిర్వహిస్తున్న అధికారులు, ఉద్యోగులు తమ విధి నిర్వహణలో బాధ్యతాయుతంగా ఉండాలని, గోప్యత పాటించాలని, బయటి వ్యక్తుల బెదిరింపులు లేదా ఒత్తిడులకు లోనై, కీలక సమాచారాలను, డాక్యుమెంట్లను ఇతరులకు అందజేయడం దుష్ప్రవర్తనగా భావించటం అవుతుందని హెచ్చరించారు. ఎవరి ప్రలోభాలకు, బెదిరింపులకు గురికావాల్సిన అవసరం లేదని తెలిపారు. గోప్యత గల సమాచారం కోసం డిమాండ్ చేస్తూ, ఒత్తిడి చేసే వ్యక్తుల సమాచారాన్ని యాజమాన్యానికి తెలియజేయాలని, ఈ విధంగా ఫిర్యాదు చేసే వారి సమాచారం బయటకు వెల్లడి కాకుండా కంపెనీ జాగ్రత్త వహిస్తుందని, బెదిరించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటుందని పేర్కొన్నారు. ఈ హెచ్చరిక తర్వాత కూడా ఎవరైనా కంపెనీ కీలకమైన, గోప్యనీయ సమాచారాన్ని బయటకు వెల్లడించినట్లయితే వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆయన ఆదేశించారు. అలాగే కంపెనీలో వివిధ కింది శాఖల నుండి పై శాఖల వారికి పంపించే నోట్ ఫైల్స్, ముఖ్యమైన పత్రాలను అత్యవసర సందర్భంలో కంపెనీ మెయిల్ ద్వారా పంపించవచ్చని, కానీ వాట్సాప్ ద్వారా మాత్రం పంపించకూడదని మరొక సర్క్యులర్ లో డైరెక్టర్ పా హెచ్చరించారు. వాట్సప్ ద్వారా పంపిస్తున్న సమాచారం ఇతరులకు లీక్ అయ్యే అవకాశం ఉంది. కాబట్టి దీనిని కంపెనీ నోట్ ఫైల్స్, సమాచార ఫైల్స్ పంపించడానికి వినియోగించవద్దని ఆయన ఆదేశించారు.

# సుదీర్ఘ పోరాట చరిత్ర టిపిటిఎఫ్ సొంతం

- రాష్ట్ర ఉపాధ్యక్షులు బుటారి రాజు
- సమాజ శ్రేయస్సు, విద్యారంగ పరిరక్షణ, ఉపాధ్యాయుల సంక్షేమా లక్ష్యాం
- అణచివేత సాచి వేతలకు వ్యతిరేకంగా పోరాటాల నిర్వహణ



**భద్రాచలం టౌన్, మే 29, ప్రజాజ్యోతి** : భారతదేశ స్వాతంత్ర ఉద్యమాల స్ఫూర్తితో, ఉమ్మడి మద్రాస్ రాష్ట్రంలో తూర్పుగోదావరి జిల్లా తాపేశ్వరంలో 1932లో ఫెడరేషన్ ఆవిర్భవించింది. బ్రిటిష్ ప్రభుత్వ అణిచివేత, ఉపాధ్యాయ సంఘ నాయకులపై చర్యలు తదితర కారణాల వలన పడి లేస్తూ స్వాతంత్రానంతరం 1947లో ఆంధ్ర ఎలిమెంటరీ టీచర్స్ ఫెడరేషన్ (ఏఈటిఎఫ్) గా పునర్వ్యవస్థీకరించ బడిందని, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఏపీటీఎఫ్ గా తెలంగాణ రాష్ట్రంలో టీపీటీఎఫ్ గా వైయుక్తిక, ఉమ్మడి ఉద్యమాలను నిర్మించి నిర్వహించిన ప్రప్రధమ ఉపాధ్యాయ సంఘం అని, సుదీర్ఘ పోరాటాల చరిత్ర టిపిటిఎఫ్ సొంతమని తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ (టిపిటిఎఫ్) రాష్ట్ర ఉపాధ్యక్షులు బుటారి రాజు అన్నారు. టిపిటిఎఫ్ 12వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా స్థానిక కార్యాలయం ముందు టిపిటిఎఫ్ పతాకం ఆవిష్కరణ చేసిన అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడు తూ.... సమాజ శ్రేయస్సు, విద్యారంగ పరిరక్షణ, ఉపాధ్యాయుల సంక్షేమం లక్ష్యాలుగా, బాధ్యతలకు నిలబడు, హక్కులకై కలబడు నినాదాలుగా టిపిటిఎఫ్ పనిచేస్తున్నదని అన్నారు. విద్యారంగంలో ప్రైవేట్, కార్పొరేటీకరణలను, ప్రభుత్వ పాఠశాలల మూసివేతలను ఒక వైపు వ్యతిరేకిస్తూ జరిగే పోరాటాలలో పాల్గొంటూనే, మన ప్రభుత్వ విద్యారంగాన్ని రక్షించుకోవాలని, అందుకు బడిబాటలో ఉపాధ్యాయులు అందరూ పాల్గొని, తల్లిదండ్రులతో మాట్లాడి ప్రభుత్వ విద్యారంగం పట్ల, ఉపాధ్యాయుల బోధన పట్ల నమ్మకాన్ని కలిగించి, ప్రభుత్వం కల్పిస్తున్న వసతుల పట్ల అవగాహన కల్పించి అడ్మిషన్లు పెంచడానికి చిత్తశుద్ధితో కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పూర్వ కార్యదర్శి, ఉపాధ్యాయ దర్శిని సంపాదక వర్గ సభ్యులు మునిగడప రామాచారి, వి.ముత్తయ్య, పి.రాంబాబు, ఎం.సత్తెమ్మ, ఎస్.లక్షి తదితరులు పాల్గొన్నారు.

## భద్రాద్రి రామయ్యకు నిత్యకల్యాణం



**భద్రాచలం టౌన్,మే 29, ప్రజాజ్యోతి :** భద్రాచలం దివ్యక్షేత్రంలోని బేడా మండపంలో అర్చకులు గురువారం స్వామివారికి నిత్యకల్యాణం నిర్వహిం చారు. తెల్లవారుజామున ఆలయ తలుపులు తెరిచి స్వామివారికి సుప్రభాతం పలికి ఆరాధన, ఆరగింపు, సేవాకాలం, నిత్యబలిహరణం, నిత్యహోమాలు, నిత్యపూజలు జరిపారు. కల్యాణంలో పాల్గొన్న దాతలకు ప్రసాదాలు, శేషవస్త్రాలు అందజేశారు. ఆలయ అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

## 144 ధాన్యం కొనుగోలు కేంద్రాల నుండి 107, 18 కోట్ల విలువచేసే ధాన్యం కొనుగోలు

- అదనపు కలెక్టర్ వేణుగోపాల్ వెల్లడి

**కొత్తగూడెం కలెక్టరేట్, మే 29, ప్రజా జ్యోతి :** 2023-24 యాసంగి సీజన్ కంటే ఈ సీజన్లో 4 రెట్లు అధికంగా ధాన్యం కొనుగోలు చేసినట్లు అదనపు కలెక్టర్ వేణుగోపాల్ వెల్లడించారు . కొత్తగూడెం జిల్లాలో 2024- 25 యాసంగి సీజన్లో మొత్తం 144 ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా 50853-880 మెట్రిక్ టన్నుల ధాన్యమును 75 17 రైతుల నుండి 117, 58 కోట్ల విలువ చేసే ధాన్యమును కొనుగోలు చేయడం జరిగిందని, ఈ సీజన్లో ఇప్పటివరకు 67 89 మంది రైతుల నుండి 46 328 320 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని 107, 18 కోట్ల విలువచేసే ధాన్యాన్ని రైతు ఖాతాలో జమ చేయడం జరిగిందన్నారు. గత యాసంగి 2023 -24 సీజన్ కంటే ఈ సీజన్లో నాలుగు రెట్లు అధికంగా ధాన్యం కొనుగోలు కేంద్రాలకు రావడం జరిగిందన్నారు. రైతులు ఎలాంటి ఇబ్బందులకు గురికాకుండా రైతులు దళారీ వ్యవస్థ వల్ల నష్టపోకుండా ప్రభుత్వం అందించే మద్దతు ధరను పొందాలని, కొనుగోలు కేంద్రాల నిర్వహకులు నిబంధన మేరకు ధాన్యాన్ని కొనుగోలు చేయాలని, కొనుగోలు కేంద్రాల్లో తగినంత హమాలీలను ఏర్పాటు చేసి ధాన్యం కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేయాలని, ధాన్యం తూకం వేసిన వెంటనే మిల్లులకు తరలించాలని సూచించారు. ధాన్యం కొనుగోలు చేసేటప్పుడు అవసరమైన టార్పాలిన్స్, తూకం, యంత్రాలు, తేమ మీటర్లను తగు మొత్తంలో ఏర్పాటు చేసుకోవాలని కొనుగోలు కేంద్ర నిర్వాహకులను ఆదేశించారు. కొనుగోలు కేంద్రంలో ధాన్యం కొన్న వెంటనే ట్యాబ్ లో ఆన్లైన్ రైతు వివరాలను నమోదు చేయాలని సూచించారు. రైతు ధాన్యం 48 గంటల్లో నేరుగా రైతు ఖాతాల్లో డబ్బులు చెమ చేయడం జరుగుతుందన్నారు.

## ఐటీసీ కర్మాగారంలో కార్మికుడు మృతి



**బూర్గంపహాడ్, మే 29, ప్రజాజ్యోతి :** బూర్గంపహాడ్ మండల పరిధిలోని సారపాక ఐటిసి కర్మాగారంలో గురువారం ప్రమాదం చోటు చేసుకుంది. తోటి కార్మికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. దుమ్ముగూడెం మండలం పెద్దకమలాపురానికి చెందిన హరీష్(25) సారపాక గాంధీనగర్ లో నివాసం ఉంటూ ఐటీసీ కర్మాగారంలో కాంట్రాక్టు కార్మికుడిగా జీవనం సాగిస్తున్నాడు. కాగా రోజువారి విధుల్లో భాగంగా గురువారం పీఎం-7 విభాగంలో రూట్ షీట్ లో వర్షానికి రేకులు కారుతుండడంతో వాటికి లైఫ్ లైన్ తాడు సహాయంతో హరీష్ మరమ్మత్తులు చేస్తుండగా నడుముకు ఉన్న బెల్టు ఊడిపోవడంతో ప్రమాదవశాత్తు కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. తోటి కార్మికులు అంబులెన్స్ లో భద్రాచలం ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడు పద్మ ఇన్సులేషన్ కంపెనీ కాంట్రాక్టర్ వద్ద కాంట్రాక్టు కార్మికునిగా పనిచేస్తున్నాడు. ఇది ఇలా ఉండగా అతి పెద్ద కర్మాగారంలో కార్మికుల భద్రతపై సేఫ్టీ క్లాసులు నిర్వహించే భద్రత అధికారులు సంబంధిత సూపర్వైజర్లు విధుల్లో కార్మికుల భద్రతను పట్టించుకోకపోవడం వలన ఇలాంటి సంఘటనలు జరుగుతున్నాయని ఇవి పునరావృతం కాకుండా చూడాల్సిన బాధ్యత యాజమాన్యంపై ఉందని స్థానికులు మండిపడుతున్నారు.

## జనరల్ మేనేజర్ (సివిల్) తిరుకోటి సూర్యనారాయణ కు సన్మానం



**కొత్తగూడెం సింగరేణి, మే 29, ప్రజాజ్యోతి :** కొత్తగూడెం జిఎం కార్యాలయంలో ఈ నెల 31న పదవి విరమణ పొందుతున్న జిఎం (సివిల్) తిరుకోటి సూర్యనారాయణ ని ఘనంగా పుష్పగుచ్చంతో ,శాలువా లతో కొత్తగూడెం ఏరియా అధికారులు ,జిఎం కార్యాలయంలోని అధికారులందరూ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కొత్తగూడెం ఏరియా జిఎం మాట్లాడుతూ తిరుకోటి సూర్యనారాయణ, జనరల్ మేనేజర్ (సివిల్) కంపెనీకి చేసిన సేవను గురించి కొనియాడారు. వారు సింగరేణి సంస్థలో వివిధ హోదాలలో పనిచేశారని వారు చేసిన సేవలు మరువలేనివని అంకితభావంతో పనిచేసి, అందరి మన్నలను పొందారని, వారి శేష జీవితం సుఖ సంతోషాలతో ఉండాలని కోరుకుంటున్నాను అని అన్నారు. ఈ కార్యక్రమములో కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ ఎం.షాలెం రాజు, ఎస్.ఓ.టు జిఎం జీవి కోటిరెడ్డి, ఏరియా ఇంజెనీర్ కే. సూర్యనారాయణ రాజు, ఎజిఎం (సివిల్) సిహెచ్.రామకృష్ణ, ఎజిఎం (ఫైనాన్స్) కే హన సుమలత, డిజిఎం(ఐఈ) ఎన్. యోహాన్, ఏజెంట్ పద్మావతి ఖని బి రవీందర్, ఏరియా రక్షణాధికారి ఎం.వెంకటేశ్వరరావు, ఏరియా స్టోర్ ఇంచార్జ్ లక్ష్మణమూర్తి, ఇంచార్జ్ పర్చేస్ డిపార్ట్మెంట్ బి.మాధవ్, ఇంచార్జ్ క్వాలిటీ మదన్మోహన్, ఎస్.ఓ.ఎం ఎన్విరాన్మెంట్ తోట సత్యనారాయణ, మెడికల్ ఆఫీసర్ ఎం. పరశురాములు ఐటీ మేనేజర్ శేషశ్రీ, ఇంచార్జ్ ఆర్.సి.హెచ్. పి ఎస్.కే. కరిముల్లా, సీనియర్ పిఓ జి. సంఘమిత్ర, ఏరియా ఎస్టేట్స్ ఆఫీసర్ బి. తౌర్య, అధికారులు వివి మధుకర్, బి. శంకర్ ఇతర అధికారులు, ఆఫీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## మంత్రికి స్వాగతం పలికిన కాంగ్రెస్ నేతలు



**ఇల్లందు, మే 29, ప్రజాజ్యోతి :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పర్యటన ముగించుకొని హైదరాబాద్ వెళ్తున్న రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ, పంచాయతీ రాజ్ శాఖ మంత్రి దనసరి సీతక్కకు గురువారం సీనియర్ కాంగ్రెస్ నాయకుడు ఎస్. కె. జానీ ఆధ్వర్యంలో ఘనంగా స్వాగతం పలికి శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు గౌస్, శ్రీనివాస్, ఇబ్రహీమ్, లింగంపల్లి శ్రీనివాస్, రాజేందర్, మారగని నాగేశ్వరరావు, కంది కొమరయ్య పాల్గొన్నారు.

## రైతులకు జీలుగు విత్తనాల పంపిణీ




**బూర్గంపహాడ్,మే 29, ప్రజాజ్యోతి :** రైతులు భూమి బలంగా ఉండాలంటే పెస్టిసైడ్ వాడకండి తగ్గించి జీలుగు, జింకు వంటి పచ్చి రొట్టను వాడాలని మణుగూరు ఏడిఏ తాతారావు అన్నారు. గురువారం మండల కేంద్రమైన బూర్గంపహాడ్ ప్రాథమిక సహకార పరపతి సంఘం ఆధ్వర్యంలో రైతులకు జీలుగు విత్తనాలతో పాటు బిపిటి 5204 విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీలుగలు ప్రధాన పంటకు ముందస్తుగా నేలను తయారు చేస్తాయని పొలంలో జీలుగును కలియదున్నిన తర్వాత అవి నేలకు ఆ తర్వాత వేసే పంటకు విశేష లాభాలు అందిస్తుందన్నారు. నేలలో కరగని మూలకాలను పంటకు అనుకూలంగా మార్చుతాయని నీటి నిల్వ సామర్థ్యం పెంచుతాయన్నారు. రైతులు జీలుగు విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జీలుగు విత్తనాలు అవసరమైన రైతులు పట్టా పాస్ పుస్తకం ఆధార్ జిరాక్స్ తో కార్యాలయానికి వచ్చి సమర్పించి 50% రాయితీతో వీటిని పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు బిక్కసాని శ్రీనివాసరావు, సీఈవో ప్రసాద్, సొసైటీ సిబ్బంది, తిరుపతి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## స్వర్గీయ బానోత్ మదన్ లాల్ మృతికి సంతాపం తెలియజేసిన వనమా

**పాల్వంచ(రూరల్ ), మే 29,ప్రజా జ్యోతి :** వైరా మాజీ శాసనసభ్యులు బానోత్ మదన్ లాల్ స్వగ్రామమైన ఈర్లపూడి వారి స్వగృహానికి మాజీ మంత్రివర్యులు వనమా వెంకటేశ్వరరావు, రాష్ట్ర బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు వనమా రాఘవేంద్రరావు వెళ్లి ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించి, వారి కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ సందర్భంగా వనమా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ వైరా మాజీ శాసనసభ్యులు బానోత్ మదన్ లాల్ నాకు మంచి మిత్రుడని ఎంతో ఆప్యాయమైన మిత్రుడుని కోల్పోయానని, వైరా నియోజకవర్గంలో బిఆర్ఎస్ పార్టీకి తీరని లోటు అని మాజీ మంత్రి వనమా అన్నారు. వనమా వెంట మాజీ ఉర్దూఘర్ చైర్మన్ ఎస్ కె. అన్వర్ భాష, ఆత్మ కమిటీ డైరెక్టర్ శేషాద్రి వినోద్, మాజీ ఉర్దూగర్ డైరక్టర్ మజీద్, బొందుగల శ్రీధర్, ఏనుగుల శ్రీను, కోయాడ శ్రీను, రాజేందర్, లచ్చిరాం, చిన్న శ్రీను, మైను, అక్బర్, గొడ్ల శ్రీను, రాజు , మదన్ లాల్ కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



# ఎమ్మెల్యే జారే జాలి హృదయం

- ప్రమాద బాధితుడిని సొంత వాహనంలో ఆసుపత్రికి తరలింపు





**ములకలపల్లి, మే 29, ప్రజాజ్యోతి:** అశ్వారావుపేట శాసనసభ్యులు జారే ఆదినారాయణ తనది జాలి హృదయమని మరోమారు చాటిచెప్పారు. పాల్వంచ మండలంలోని కిన్నెరసానిలో జరిగిన కార్యక్రమంలో పాల్గొని తిరిగి వస్తున్న క్రమంలో గంగారం అటవీ ప్రాంతంలో రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తిని తన వాహనంలో ఎక్కించుకొని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి తక్షణ వైద్యసహాయం అందేలా ఏర్పాటు చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి ములకలపల్లి మండలం పాత గంగారం గ్రామానికి చెందిన సున్నం వెంకటేష్, దమ్మపేట నుండి కుటుంబ సభ్యు లతో కలిసి ద్విచక్ర వాహనంపై స్వగ్రా మానికి వస్తున్న సమయంలో ప్రమాదవశాత్తు ద్విచక్ర వాహనం అదుపు తప్పి పడిపోవడంతో వెంకటేష్ కాలు విరిగిపోయింది. తన భార్య ,కుమా రుడు స్వల్ప గాయాలతో బయటపడ్డా రు అదే సమయంలో అటుగా వస్తున్న ఎమ్మెల్యే జారే ప్రమాద బాధితులను తన వాహనంలో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించడమే కాకుండా సిబ్బందిని అప్రమత్తం చేసి వెంటనే వైద్య సహాయం అందిన ఏర్పాట్లు చేశారు. గతంలోనూ ఇటువంటి అనేక సంఘటనల్లో తన మానవత్వాన్ని చూపి ఇప్పుడూ మరోసారి మంచి మనసు చాటుకున్న ఎమ్మెల్యే జారే తీరును పలువురు అభి నందిస్తూ హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## టీపిటీఎఫ్ 12వ ఆవిర్భావ దినోత్సవం



**చుంచుపల్లి, మే 29 ,ప్రజా జ్యోతి** :టీపీటీఎఫ్ 12 వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా గురువారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాత జిల్లా విద్యా శాఖ కార్యాలయం ఎదురుగా టీపీటీఫ్ సీని యర్ నాయకులు కుర్సం వెంక టేశ్వర్లు ప్రధానోపాధ్యాయులు, ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాల కాచనపల్లి జెండా ను ఆవిష్కరిం చారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతు ఎంతో ఉన్నతమైన ఆశయాలు కలిగిన టీపీటీఎఫ్ లో సభ్యులుగా చేరాలని, టీపీటీఎఫ్ సభ్యులందరు కూడా సంఘ నిర్మాణం, అభివృద్ధి కోసం కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యాక్షులు జోగా రాంబాబు , వాంకు డోత్ సరియా జిల్లా కార్యదర్శి బానోత్ రమేష్ , సుజాతనగర్ మండలం ప్రధాన కార్యదర్శి మాలోత్ తారాసింగ్ ,జిల్లా ప్రధానోపాధ్యాయుల ప్రతినిధి టీపీటీఫ్ సీనియర్ నాయకులు చింత బుచ్చిరాములు, భూక్యా రాములు పాల్గొన్నారు.

## బొమ్మనపల్లి గ్రామంలో ఘనంగా ముత్యాలమ్మ తల్లి కి బోనాలు



**టేకులపల్లి,మే29,ప్రజాజ్యోతి:** బొమ్మనపల్లి గ్రామంలో ముత్యాలమ్మ తల్లికి బోనాలు ఘనంగా గురువారం సమర్పించారు. మేళ తాళాలతో అంగరంగ వైభవంగా నృత్యాలతో అమ్మవారికి ఇష్టమైన పాయసం,గుగ్గిళ్ళు,ఇష్టమైన ఆహార పదార్థాలు బోనంగా తయారుచేసి భక్తులు ఇష్టంగా సమర్పించారు. ఈ కార్యక్రమానికి గ్రామ పెద్దలు, మహిళలు యువతి యువకులు వర్గాల వారిగా వెళ్లి బోనాలు సమర్పించారు. పంటలు బాగా పండాలని, ఊరి ప్రజలు ఆరోగ్యంగా ఉండాలని అమ్మవారి ఆశీస్సులు గ్రామ ప్రజలపై పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో గిరిజన ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి. హతిరం నాయక్, గ్రామ కమిటీ సభ్యులు బానోత్ సాములు నాయక్, బుర్ర ధర్మయ్య గౌడ్, బొమ్మెర్ల వరప్రసాద్, నల్లమస రాజన్న తదితరులు పాల్గొన్నారు.

## విత్తన అమ్మకాలలో నిబంధనలు మీరితే కఠిన చర్యలు



**టేకులపల్లి,మే29, ప్రజాజ్యోతి:** విత్తనాల షాపుదారులు నిబంధనలు మీరితే కఠిన చర్యలు ఉంటాయి అని ఇల్లెందు డీఎస్పీ చంద్రభాను అన్నారు. గురువారం టేకులపల్లి మండల కేంద్రంలో విత్తన దుకాణాల ను ఇల్లెందు డీఎస్పీ ఆకస్మికంగా టేకులపల్లి సీఐ సురేష్, ఏవో అన్నపూర్ణలతో కలిసి తనిఖీ నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విత్తన దుకాణాలలో లైసెన్స్, విత్తన అమ్మకాల పర్మిషన్ కాపీ ఫార్మ్ సీ, గత సంవత్సరం అమ్మకాలు జరిపిన విత్తనాలు షాప్లో ఉంచి అమ్ముతున్నారా అనే విషయాలు పరిశీలించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ రైతులకు విత్తన విక్రయాలలో ఎలాంటి ఇబ్బంది రావద్దు అని, అమ్మిన ప్రతి విత్తన ప్యాకెట్ల వివరాలు,విత్తన ప్యాకెట్ల లాట్ నెంబర్, తయారీ తేదీ వివరాలు సరిగ్గా వేయాలని,నిబంధనలు మీరిన, రైతులను మోసగిస్తే కఠిన చర్యలు ఉటాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐ సురేష్,ఏవో అన్నపూర్ణ, ఎస్సై ఎ.రాజేందర్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రహదారులు బ్రిడ్జిల నిర్మాణాలతోనే మారుమూల ప్రాంతాల అభివృద్ధి

- రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు , వయోవృద్ధుల సంక్షేమ శాఖల మంత్రి ధనసరి సీతక్క
- దశాబ్దాల నాటి ప్రజల కష్టాలకు పరిష్కారం సుగమం
- కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు

**కొత్తగూడెం కలెక్టరేట్, మే 29, ప్రజా జ్యోతి :** మారుమూల ప్రాంతాల అభివృద్ధి రహదారులు , బ్రిడ్జిల నిర్మాణాలతోనే సాధ్యమవుతుందని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళ, శిశు వయోవృద్ధుల సంక్షేమ శాఖ మంత్రి ధనసరి సీతక్క అన్నారు. గురువారం పాత పాల్వంచ నుండి పెనుబల్లి రోడ్డు 0/600 వద్ద ఆరున్నర కోట్ల రూపాయలతో నిర్మించనున్న హై లెవెల్ బ్రిడ్జి పనులకు స్థానిక శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు , భద్రాచలం శాసనసభ్యులు తెల్లం వెంకట్రావు తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఈ ఆధునిక యుగంలో హైవేలు, స్కై వేలు ,ఫ్లై వేలు అన్ని వచ్చినప్పటికీ మారుమూల ప్రాంతాల్లో ఇప్పటివరకు వన్ వేలు కూడా రాలేదని అన్నారు. దానిని దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం ప్రతి గూడెం, తండాకు, గ్రామాలకు పంచాయతీలకు , మండలాలకు రోడ్డు కనెక్టివిటీ ఉండే విధంగా రహదారుల నిర్మాణం చేపడుతున్నామన్నారు. ప్రజా ప్రభుత్వం తీసుకొచ్చే సంక్షేమ పథకాలు మారుమూల ప్రాంతాల ప్రజలకు అందించడానికి రహదారులు ముఖ్యమన్నారు. ఒక ప్రాంతం అభివృద్ధి చెందిన ప్రాంతం అని చెప్పాలంటే ఆ ప్రాంతానికి కమ్యూనికేషన్ ,కనెక్టివిటీ అవసరం అన్నారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న మారుమూల ప్రాంతాల ప్రజలు, గర్భిణీలు వాగులు వంకలు దాటాలంటే బ్రిడ్జిల నిర్మాణం తప్పనిసరి అని అన్నారు, మారుమూల గిరిజన ప్రాంతాల అభివృద్ధికి, రహదారుల నిర్మాణానికి కృషి చేస్తానని మంత్రి తెలిపారు.అనంతరం కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ దశాబ్దాల నాటి పెనుబల్లి గ్రామ ప్రజల ఇబ్బందులకు బ్రిడ్జి నిర్మాణంతో పరిష్కారం దొరికిందన్నారు. ప్రజల అవసరాలకు తగ్గట్టుగా బ్రిడ్జి నిర్మాణంలో మార్పు చేసి అవసరమైతే ఇంకా ఎక్కువ నిధులు కేటాయిస్తామని తెలియజేసినందుకు మంత్రికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.మారుమూల గిరిజన ప్రాంతాల అభివృద్ధికి రహదారులతో పాటు ఇంకా ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టవలసిన అవసరం ఉందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ, మారుమూల ప్రాంతాల అభివృద్ధికి నిధులు కేటాయించాలని,ఇంకా ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని ఆయన మంత్రిని కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఈ ఈ శ్రీనివాసరావు, కమిషనర్ సుజాత, ఎంపీడీవో , సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## నీటి కోసం ఖాళీ బిందెలతో నిరసన



**టేకులపల్లి,మే29,ప్రజాజ్యోతి** :గత కొన్ని రోజుల నుండి లచ్చ తండా గ్రామంలో త్రాగు నీరు లేక గ్రామస్తులు ఖాళీ బిందెలతో నిరసన తెలిపారు. మండలంలోని దాస్తండా గ్రామపంచాయతీ లచ్చతండ గ్రామంలో 15 రోజులుగా సరఫరా లేక మిషన్ భగీరథ నీళ్లు తండావాసులకు అందకపోవడంతో వారు డిపి సిస్టం నీటిని వాడుకుంటున్నారు. ఆ బోరు కూడా మొరాయించగా గ్రామంలో ఉన్న చేతి పంపుపై తండాలోని 50 కుటుంబాలు దానిమీద ఆధారపడడం అంటే చాలా కష్టంగా ఉందని వారు తెలిపారు. నీటి కోసమైనా వేకువజామునంచే ఆ చేతి పంపు వద్ద నీటి కోసం క్యూ కడుతు న్నారు అని ఆవేదన వ్యక్తం చేశారు. మా తండాలో నీటి సమస్యలను పరిష్కరించాలని కోరుతూ డిపి సిస్టం బోరు వద్ద ఖాళీ బిందెలతో తండా మహిళా మణులు నిరసన వ్యక్తం చేశారు.ఈ విషయం పై సంబంధిత అధికారులు వెంటనే స్పందించి తండలో నీటి ఎద్దడిని తీర్చాలని వేడుకుంటున్నామన్నారు.

## హజ్ కమిటీ ఆధ్వర్యం లో సివిల్స్ కు ఉచిత శిక్షణ

- గడువు తేదీ జూన్ 21
- మైనార్టీ జిల్లా అధ్యక్షులు ఎండీ. యాకూబ్ పాషా

**కొత్తగూడెం కలెక్టరేట్, మే 29, ప్రజా జ్యోతి :** కొత్తగూడెంలో 2026లో జరగనున్న యూపీఎస్సీ సివిల్స్ ప్రిలిమ్స్, మెయిన్స్ పరీక్షలకు హాజరు కానున్న అభ్యర్థులకు ముంబైలోని హజ్ కమిటీ ఆధ్వర్యంలో నడుస్తున్న "హజ్ హౌస్ రెసిడెన్షియల్ కోచింగ్ ఇన్స్టిట్యూట్ " వారు అందిస్తున్న ఉచిత శిక్షణను పొందేందుకు దరఖాస్తు చేసుకోవాలని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మైనార్టీ సంక్షేమ సంఘం అధ్యక్షులు ఎండీ. యాకూబ్ పాషా గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఉచిత శిక్షణ పొందేందుకు సదరు సంస్థ జులై 13 న హైదరాబాద్ లో అర్హత పరీక్ష నిర్వహించబడుతుందని, అర్హత పరీక్షలో మెరిట్ సాధించిన వారికి ఒక సంవత్సరం పాటు ఉచిత శిక్షణతో భోజన, వసతి సౌకర్యం కల్పించటం జరుగుతుందన్నారు. అర్హత, ఆసక్తి కలిగిన అభ్యర్థులు తమ వివరాలను జూన్ 21 లోపు www.hajcommittee.gov.in అనే వెబ్ సైట్ నందు 100 పరీక్ష రుసుము చెల్లించి ఆన్ లైన్ లో నమోదు చేసుకోవాలని తెలిపారు. ఈ అవకాశాన్ని ముస్లింలు, ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ కులస్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పూర్తి వివరాలకు 8520860785 నంబర్ కు సంప్రదించాలని కోరారు.